గురువులను గౌరవించడం అందరి బాధ్యత



ప్రధానోపాధ్యాయుడు రాంరెడ్డిని సత్కరిస్తున్న కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి..

దుండిగల్: విద్యార్థుల అజ్ఞానపు చీకట్లను తొలగించే గురువులను సత్కరించుకోవడం మన బాధ్యత అని బౌరంపేట కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులను ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా జీవితాన్ని ప్రారంభించి భారత రాష్ట్రపతి పదవిని అలంకరించిన భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా టీచర్స్ డే ను నిర్వహిస్తారన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తూ, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది యువతను అత్యున్నత శిఖరాలను చేరుస్తున్న గురువులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ సత్తిరెడ్డి, సురేందర్ రెడ్డి, మన్నె శేఖర్ ముదిరాజ్, కటకం విరేష్, వెంకట్, ప్రభు, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామిరెడ్డి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ప్రభావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు



జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థాన హుండీ లెక్కింపు గురువారం దేవాలయ మండపంలో జరిగింది. ఈఓ కృష్ణమాచార్యులు సమక్షంలో హుండీని లెక్కించారు. 6 నెలలకు గాను హుండీ ద్వారా రూ.2,84,759 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. హుండీ లెక్కింపులో విఠల్ రావు, సుధాకర్ రావు, ప్రభాకర్, శ్రీనివాస్, మల్లికార్జున్ రెడ్డి, అర్చకులు రామాచార్యులు, విజయ్ కుమార్‌చార్యులు, వేద పాఠశాల విధ్యార్థులు, దేవాదాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



మున్సిపల్ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

దుండిగల్: మున్సిపల్ సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ కె.సత్యనారాయణ రావు అన్నారు. గండిమైసమ్మలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో గురువారం ఈఎస్ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారిని ఈఎస్ఐ ఆస్పత్రికి రెఫర్ చేశారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి హెల్త్ క్యాంపు నిర్వహిస్తామని సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఎస్ సునంద, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ సాత్విక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచందర్, అంజయ్య, వైద్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే ఉపేక్షించం



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్: ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే ఊరుకునేది లేదని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గులాం కలీం అన్నారు. గాజుల రామారావు డివిజన్ దేవేందర్ నగర్ సర్వే నంబర్ 342 ప్రభుత్వ స్థలంలో చేపట్టిన గదులు, బేస్‌మెంట్ల నిర్మాణాన్ని గురువారం సిబ్బందితో కలిసి కూల్చివేశారు. ప్రభుత్వ స్థలాలపై నిఘా ఏర్పాటు చేస్తున్నామని, నిర్మాణాలు చేపడితే తక్షణమే కూల్చివేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పోస్టర్ ఆవిష్కరణ



సుభాష్‌నగర్: ఓపెన్ ఇంటర్ అడ్మిషన్స్ పోస్టర్‌ను గురువారం కుత్బుల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ నాగేందర్, జిల్లా కోఆర్డినేటర్ సత్యనారాయణతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటర్ చదవాలనుకునే విద్యార్థులకు అక్టోబర్ 31 వరకు అవకాశముందని దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కోఆర్డినేటర్ పిడమర్తి ఉపేందర్, అధ్యాపకులు పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, రీకండక్టరింగ్ పనుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తనుందని కొంపల్లి సెక్షన్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ వెన్‌సాయి ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సినీ ప్లానెట్, ఎన్‌సీఎల్‌నార్త్ కాలనీ, ఎన్‌సీఎల్ సాయిబాబా ప్రాంతాల్లో, అదే విధంగా 11కేవీ ఎన్‌సీఎల్ పరిధిలో సేఫ్టీ పర్సన్ నేపథ్యంలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, 11కేవీ జీబీఆర్ ఫీడర్ పరిధిలో చెట్లకొమ్మల తొలగింపు నేపథ్యంలో మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ పేర్కొన్నారు.

కట్టడి కష్టమేనా..?

- జీడిమెట్లలో యథేచ్ఛగా రసాయన వ్యర్థాల డంపింగ్
- నాలాల్లో హానికారక రసాయనాల పారబోత..
- జాడలేని పీసీబీ నైట్ పెట్రోలింగ్ వ్యవస్థ..
- పనిచేయని సీసీ కెమెరాలు..



ఎస్వీ కో ఆపరేటివ్ సొసైటీ నాలాల్లో పేరుకుపోయిన రసాయనాలు..



జీడిమెట్ల డిపో వద్ద నాలాలో పారుతున్న రసాయనాలు..

జీడిమెట్ల: ఆసియా ఖండంలోనే అతిపెద్దదైన జీడిమెట్ల పారిశ్రామికవాడలో వెయ్యికి పైగా పరిశ్రమలు కొనసాగుతున్నాయి. అయితే పారిశ్రామికవాడ నాలాల్లో రసాయన వ్యర్థాలు మాత్రం విచ్చలవిడిగా పారబోస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళల్లో గుట్టుచప్పుడు కాకుండా నాలాల్లో రసాయనాలు పారబోస్తున్నా పీసీబి అధికారులు పట్టించుకోవడం లేదు. ఇతర ప్రాంతాల ఫార్మా, బల్క్‌డ్రగ్ పరిశ్రమల్లో వెలువడిన వ్యర్థాలను కూడా ఇక్కడి నాలాల్లో పారబోస్తున్నా తమకు సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా బాధ్యులపై అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోతే భూగర్భ జలాలు రసాయనాలతో నిండిపోయే ప్రమాదం ఉంది.

కనిపించని నైట్ పెట్రోలింగ్ సిబ్బంది..

గతంలో పీసీబి అధికారులు రసాయనాల డంపింగ్ ముఠా కదలికలపై నిఘా పెట్టి వారి సమాచారాన్ని రాబట్టేవారు. నైట్ పెట్రోలింగ్ టీంలు నిఘా ఉంచి రాత్రివేళ డంపింగ్ ముఠాలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకునేవారు. డంపింగ్‌కు తీసుకువచ్చే రసాయనాలను ఏఏ పరిశ్రమలకు చెందినవో గుర్తించి సదరు పరిశ్రమలపై తగిన చర్యలు తీసుకునేవారు. అయితే గత నాలుగేళ్లగా పీసీబీ నైట్ పెట్రోలింగ్ టీం అనే మాట వినబడడం లేదు ..

అన్ని వ్యర్థాలు ఇక్కడే..

బొంతపల్లి, మేడ్చల్, గాగిల్లాపూర్, గుమ్మడిదల ప్రాంతాల్లోని బల్క్‌డ్రగ్, ఫార్మా పరిశ్రమల నుంచి కొందరు వ్యర్థ రసాయనాలను తీసుకువచ్చి జీడిమెట్లలోని నాలాల్లో పారబోస్తున్నారు. దూర ప్రాంతాల్లో ఉన్న పారిశ్రామికప్రాంతాల్లో వ్యర్థాలు పారబోయడానికి అనువైన చోటు లేదు. సదరు ప్రాంతాల్లో పోలీసు నిఘాతో పాటు కెమరాలు ఉండటంతో సదరు వ్యక్తులు జీడిమెట్ల ప్రాంతాన్ని అనువైన చోటుగా చేసుకుని దందా నడుపుతున్నారు.

రసాయనాలతో ఇబ్బంది పడుతున్నాం.



నేను గత పదేళ్లుగా కుత్బుల్లాపూర్‌లో ఉంటున్నాను. మా ఇళ్లు నాలాకు దగ్గరగా ఉండటంతో అర్ధరాత్రి ఘాటైన రసాయనాల వాసనలు వస్తున్నాయి ఇంటి తలుపులు మూసుకుని ఉన్నా భరించలేని వాసన వస్తుంది. అధికారులు జోక్యం చేసుకుని కెమికల్స్ నాలాలో పారబోయకుండా చూడాలి.

–శ్రీకాంత్ (కుత్బుల్లాపూర్ నివాసి)..

పనిచేయని సీసీ కెమెరాలు..

జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతాల్లోని సీసీ కెమెరాల్లో ఒక్కటి కూడా పనిచేయడం లేదు. దీంతో వ్యర్థాలను డంప్‌చేసే కేటుగాళ్లు జీడిమెట్లను డంపింగ్‌కు అనువైన స్థలంగా ఎంచుకున్నారు. రాత్రివేళ ట్యాంకర్లలో గుట్టుచప్పుడు కాకుండా తీసుకువచ్చి నాలాల్లో పారబోసి వెళ్తున్నారు. ఈ ముఠాలు రాత్రి 9గంటల సమయంలో జీడిమెట్లకు చేరుకుని ఏదో ఒక ప్రాంతంలో పార్కింగ్ చేసుకుని ఉంటారు. అదను చూసుకుని వ్యర్థాలను పారబోసి అక్కడ నుండి ఉడాయిస్తారు. సీసీ కెమెరాలు, పీసీబీ అధికారుల అధికారుల తనిఖీలు లేకపోవడం వీరికి కలిసివస్తోంది.

పట్టపగలు గణేష్ లడ్డూ చోరీ

నిజాంపేట్: పట్టపగలే గణేశ్ మండంలో స్వామి వారి లడ్డూ చోరీకి గురి కావడం కలకలం రేపింది.. వివరాల్లోకి వెళితే.. నిజాంపేట్ కార్పొరేషన్ ఆదిత్య గార్డెన్‌లోని నిర్వాణ్ వీరా ఆవాస్ అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో గురువారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు లడ్డూను ఎత్తుకెళ్లారు. దీనిని గుర్తించిన మండప నిర్వాహకులు బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా గణేష్ లడ్డూ చోరీపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అనుమతుల్లేకుండా ఫర్టిలైజర్స్ తయారీ

– నిందితుడిపై కేసు నమోదు



జీడిమెట్ల: ఎలాంటి అనుమతులు లేకుండా పంటలకు అందించే బయో ఉత్పత్తులను తయారు చేస్తున్న వ్యక్తిపై జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై హరీశ్, వ్యవసాయ అధికారి యాదగిరి వివరాల ప్రకారం ... జీడిమెట్ల ఫేజ్–5 రాంరెడ్డినగర్‌లో సాధు సతీష్‌రెడ్డి అనే వ్యక్తి పిల్‌గ్రిమ్స్ పేరిట పురుగు మందులు, ఫర్టిలైజర్స్ తయారు చేస్తున్నాడు. మంగళవారం విశ్వసనీయ సమాచారం అందుకున్న కుత్బుల్లాపూర్ వ్యవసాయ అధికారి యాదగిరి జీడిమెట్ల పోలీసులతో కలిసి సదరు పరిశ్రమపై దాడులు నిర్వహించారు. కాగా, సతీష్‌రెడ్డి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే బయోప్రొడక్ట్స్ పేరిట పురుగు మందులు, ఫర్టిలైజర్స్ తయారు చేస్తున్నట్లు అధికారులు తేల్చారు. వ్యవసాయ అధికారి యాదగిరి ఫిర్యాదు మేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

మోతీనగర్: డివిజన్‌లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ సబిహాబేగం కోరారు. ఈ మేరకు గురువారం ఎస్‌పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఆలీ పారూఖీని కలిసి వినతిపత్రం అందజేశారు. డివిజన్‌లో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌లు, కరెంటు స్తంభాలు, ఏబీ కేబుల్, హెచ్‌టీ, ఎల్‌టీ కేబుల్ తదితర సమస్యలు పరిష్కరించాలన్నారు. నిధుల మంజూరుకు హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహ్మద్ గౌసుద్దీన్ పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



శ్రీశైలంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కృష్ణారావు

దుండిగల్: శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామిని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంట కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, కొలుకుల జగన్, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగు



దుండిగల్: ప్రజలకు భద్రత కల్పించడంతో పాటు వారితో పోలీసులు స్నేహపూర్వక వాతావరణం ఏర్పడేలా చర్యలు తీసుకుంటున్నామని మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి అన్నారు. దుండిగల్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ పోలీసింగ్, ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీలో దుండిగల్ పరిధిలోని రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ ఉద్యోగులు, పలు గ్రామాల, కాలనీల యువకులు పాల్గొన్నారు 10 రోజుల పాటు నిర్వహించిన ఈ ఈవెంట్ లో 14 జట్లు పాల్గొనగా బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీ, గండిమైసమ్మ టీమ్స్ ఫైనల్‌లో తలపడగా ఇందిరమ్మ కాలనీ యువకుల జట్టు ఫైనల్ ట్రోఫీ ని గెలుచుకుంది. విజేతలకు కోటిరెడ్డి ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో దుండిగల్ సీఐ సతీష్, డీఐ సతీష్, ఎస్సైలు రామ్మోహన్ రెడ్డి, శంకర్, బౌరంపేట్ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కుట్ర



కుత్బుల్లాపూర్: బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులు ప్రాంతీయ విభేదాలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందేందుకు కుట్ర పన్నుతున్నారని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గురువారం ఆయన గాంధీ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని బతకొచ్చినోడంటూ కౌశిక్‌రెడ్డి మాట్లాడటం సమంజసం కాదని, ఈ వ్యాఖ్యలు ప్రాంతీ విద్వేషాలను రెచ్చగట్టేలా ఉన్నాయన్నారు. గతంలో కేసీఆర్ ఆంధ్రకు వెళ్లి అప్పట్లో ఒక మంత్రి ఇంట్లో భోజనం చేసి అంత కలిసి ఉండాలని చెప్పారని, కాంగ్రెస్ పార్టీ తెలుగు రాష్ట్రాల ప్రజలు కలిసి ఉండాలని కోరుకుంటోందన్నారు. కానీ రాష్ట్రంలో ఉనికిని కోల్పోతున్న బీఆర్ఎస్ నాయకులు మళ్లీ రాజకీయ ప్రయోజనాల కోసం కుట్రలు పన్నారని ఆరోపించారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన కౌశిక్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.


ప్రభుత్వ పాఠశాలకు స్థలం కేటాయించండి



అడిషనల్ కలెక్టర్ విజేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు..

దుండిగల్: బౌరంపేట ప్రభుత్వ పాఠశాలకు స్థలం కేటాయించాలని బీజేపీ నేతలు అన్నారు. ఈ మేరకు గురువారం మేడ్చల్ కలెక్టరేట్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ విజేందర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. బౌరంపేటలోని పాఠశాల అర ఎకర విస్తీర్ణంలో మాత్రమే ఉందని, ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో 800 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారన్నారు. మైదానం కూడా లేదని, సర్వే నెంబరు 166, 472 ల్లో ఐదు ఎకరాలు స్కూల్‌కు కేటాయించాలని కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీసరి కృష్ణారెడ్డి, ఆకుల సతీష్, గోనె మల్లారెడ్డి, డి ప్రభాకర్ రెడ్డి, అరుణ్ రావు పాల్గొన్నారు.

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ సత్యనారాయణ

బాలానగర్: ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని అడిషనల్ డీసీపీ సత్యనారాయణ అన్నారు. గురువారం బాలానగర్ పోలీస్‌స్టేషన్ కార్యాలయంలో శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గణేష్ ఉత్సవాలు, మిలాద్‌నబీ పండుగను ఎటువంటి ఆటంకాలు లేకుండా జరుపుకోవాలన్నారు. ఇరువర్గాలు పరస్పరం సహకరించుకోవాలన్నారు. అనంతరం పలు జాగ్రత్తలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో బాలానగర్ ఏసీపీ హనుమంతరావు, సీఐ నవీన్‌కుమార్, డీఐ నాగిరెడ్డి, ఎస్ఐలు రామ్‌నారాయణ, మహ్మద్ హజీ, మగ్బూల్ పాషా తదితరులు పాల్గొన్నారు.

14న చిన్నారులకు డ్రాయింగ్ పోటీలు

నిజాంపేట్: బండారి లేఔట్ సంక్షేమ సంఘం, మధు పెయింట్ ఇనిస్టిట్యూట్, స్టోరీ లైన్ టాయ్స్ అండ్ గిఫ్ట్ షాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 14న బండారి లేఔట్ లోని రోడ్ నెంబర్– 3బీ లో గల కమ్యూనిటీ హాల్‌లో చిన్నారులకు గణేశుని చిత్రాలపై డ్రాయింగ్ కాంపిటీషన్ నిర్వహించనున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పాల్గొన్న చిన్నారులకు ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నారు. డ్రాయింగ్ షీట్ కమిటీ నిర్వాహకులు అందజేస్తారని, మిగతా సామాగ్రిని చిన్నారులు తెచ్చుకోవాల్సి ఉంటుందన్నారు. పోటీల్లో పాల్గొనే వారు తమ పేర్లను 13వ తేదీ రాత్రి 7 గంటల లోపు రిజిస్ట్రేషన్ తీసుకోవాలని, ఇతర వివరాలకు 9550887192, 8985362248 నెంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.



కుత్బుల్లాపూర్ గ్రామంలో..



బౌరంపేట్ కీర్తి హోమ్స్‌లో 108 ప్రసాదాల నివేదన..



సూరారం శ్రీకృష్ణనగర్‌లో..



బాచుపల్లి హనుమాన్ ఆలయంలో..



బ్యాంక్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

వైభవంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు

నియోజకవర్గ పరిధిలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం మండపాల వద్ద గణనాథులకు విశేష పూజలు నిర్వహించి స్వామి వారికి నైవేద్యాలను సమర్పించారు. నిమజ్జనాలకు తరలించిన మండపాల వద్ద సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో అన్నదానాలు నిర్వహించారు. –కుత్బుల్లాపూర్



శ్రీనివాసనగర్‌లో..



సాయిబాబానగర్ విజేత స్కూల్‌లో..



కృషి కాలనీలో అన్నదానం..



ఎస్ఆర్ నాయక్‌నగర్‌లో..